# సాక్షి
## తూర్పుగోదావరి
సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023






### రూ.2 లక్షల విరాళాలు
అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఆదివారం కె.రత్నమణి (విశాఖ) రూ.లక్ష, టి.శ్రీదశరథ మనోహరరావు (తమ్మవరం) రూ.లక్ష చొప్పున విరాళాలు సమర్పించారు.



### మది పులకించగ
సుదర్శన చక్రధారి నరసింహస్వామిని భక్తులు మనసారా సేవించారు.. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం అంతర్వేది వద్ద సముద్ర తీరం భక్తిభావంతో ఉప్పొంగింది. - 8లో ▸

### డెల్టాలకు 6,895 క్యూసెక్కులు


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 6,895 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు 2,030, సెంట్రల్ 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.10 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### కలెక్టరేట్‌లో నేడు స్పందన
రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే ప్రజలకు రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉచితంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు. మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాలు, సచివాలయాల్లో సైతం అర్జీలు సమర్పించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

### పానవట్టానికి రజత కవచం సమర్పణ


అర్చకులకు రజత కవచాన్ని అందజేస్తున్న దాతలు

రాయవరం: మండలంలోని పసలపూడిలో వేంచేసి ఉన్న మాణిక్యాంబ సమేత శ్రీ రాజేశ్వర స్వామి వారి పానవట్టానికి అనపర్తికి చెందిన పారిశ్రామికవేత్త సత్తి జనార్దనరెడ్డి, సరోజ దంపతులు, సవ్య, అరుణకుమార్‌రెడ్డి దంపతులు ఆదివారం రజత కవచం సమర్పించారు. రూ.2.50 లక్షల వ్యయంతో మూడు కేజీల వెండితో దీనిని తయారు చేయించారు. పానవట్టానికి రజత కవచాన్ని అలంకరించే ముందు అర్చకులు దామకర లక్ష్మీభీమేశ్వర శ్రీనివాస్‌శర్మ, కేదార సత్యకుమార నాగమణి శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.అయ్యప్పరాజు, సొసైటీ అధ్యక్షుడు చింతా రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

### జాతీయ అథ్లెటిక్స్‌లో ప్రతిభ


పతకాలతో నాగబాబు

సామర్లకోట: పట్టణానికి చెందిన యాతం నాగబాబు జాతీయ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటాడు. నాగబాబు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలోని మలేరియా విభాగం కాకినాడ సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్నారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకూ హైదరాబాద్ జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన నాగబాబు ఐదో ఆలిండియా నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అండ్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. 100, 800 మీటర్ల పరుగు వ్యక్తిగత విభాగాల్లో రెండు బంగారు పతకాలు.. 200, 400 మీటర్ల పరుగు పందెంలో రెండు రజత పతకాలు సాధించారు. 2013 నుంచి 2022 వరకూ జరిగిన వివిధ జాతీయ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్ పరుగు పందెం 100, 200, 400, 800, 1500 మీటర్ల పోటీల్లో ఇప్పటి వరకూ 58 పతకాలు సాధించానని నాగబాబు ఆదివారం విలేకర్లకు చెప్పారు. వీటిలో 14 బంగారు, 19 వెండి, 25 కాంస్య పతకాలు ఉన్నాయన్నారు. సుమారు 58 సంవత్సరాల వయస్సులోనూ పరుగు పందెంలో పతకాలు సాధిస్తున్న నాగబాబును పలువురు అభినందించారు.

# ఉగాదికి రెడీ

- జగనన్న కాలనీల్లో సిద్ధమవుతున్న 6,319 ఇళ్లు
- పండగ నాటికి గృహప్రవేశాలకు విస్తృత ఏర్పాట్లు
- వచ్చే నెల 29 నాటికి పనులు పూర్తి చేయడంలో అధికారుల తలమునకలు

సాక్షి, రాజమహేంద్రవరం: ఉగాది పండగ నాటికి లబ్ధిదారులను శాశ్వత గృహ యజమానులుగా మార్చేందుకు, తద్వారా వారి కుటుంబాల్లో పండగ సంతోషాన్ని సంపూర్ణంగా నింపేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ లక్ష్యాన్ని ఉగాదికి ఒక రోజు ముందే అధిగమించే ఏర్పాట్లలో జిల్లా అధికారులు తలమునకలవుతున్నారు. జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న పేదల ఇళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. కాలనీల్లో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను పూర్తి చేస్తున్నారు. మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రత్యేక బృందంగా ఏర్పడి గృహ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇల్లు కట్టుకోలేని వారికి అవగాహన కల్పించి, నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తుండటంతో లబ్ధిదారులు సైతం ముందుకు వస్తున్నారు.

**ఉగాదికి 6,319 గృహ ప్రవేశాలు**

పేదలకు శాశ్వత నివాసం కల్పించాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 1.46 లక్షల మందికి ఉచితంగా ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. వీటిలో తొలి దశలో రూ.113.48 కోట్లతో 63 వేల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఇవి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. మరికొన్నింటిలో లబ్ధిదారులు గృహప్రవేశాలు సైతం చేసుకున్నారు. మిగిలిన వాటి పనులు వేగంగా సాగుతున్నాయి. ఉగాది నాటికి 6,318 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు నిర్వహించాలని అధికార యంత్రాంగం సంకల్పించింది. ఇందుకు అనుగుణంగా యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే 1,211 ఇళ్ల పనులు వంద శాతం పూర్తయ్యాయి. మిగిలిన 5,107 నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రతి మండలంలో హౌసింగ్ అధికారులు, తహసీల్దార్లు ప్రత్యేక బృందంగా ఏర్పడి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

**మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నారు. లే అవుట్లలో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచుతున్నారు. తాగునీటి వసతికి బోర్లు తవ్వుతున్నారు. తాగు, ఇతర అవసరాలకు నీటిని సమకూరుస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన కాలనీల్లో నివసించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. అనపర్తి, బిక్కవోలు, తొర్రేడు, చాగల్లు, కొవ్వూరు కృష్ణారావు చెరువు, కడియం, దామిరెడ్డిపల్లి, నిడదవోలు వైఎస్సార్ నగర్ తదితర ప్రాంతాల్లో గృహ నిర్మాణ పనులు శరవేగంతో సాగుతున్నాయి. జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించే పనులు కూడా చురుకుగా సాగుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 755 కాలనీల్లో రూ.411 కోట్ల అంచనాతో పనులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో సైతం అధునాతన విధానం అవలంబిస్తున్నారు. మూడు పెద్ద లే అవుట్లు అయిన కొమరగిరి, వాకలపూడి (కాకినాడ), వెలుగుబంద (రాజానగరం) జగనన్న కాలనీల్లో ప్రయోగాత్మకంగా భూగర్భ విద్యుత్ సరఫరాకు కార్యాచరణ సిద్ధమైంది.

**ఉగాదికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న ఇళ్ల వివరాలు**

| మండలం | ఇళ్ల నిర్మాణ లక్ష్యం | ఇప్పటి వరకూ పూర్తయినవి |
|---|---|---|
| రంగంపేట | 407 | 213 |
| తాళ్లపూడి | 147 | 52 |
| రాజానగరం | 357 | 125 |
| పెరవలి | 190 | 60 |
| నిడదవోలు అర్బన్ | 128 | 34 |
| నిడదవోలు రూరల్ | 323 | 85 |
| కడియం | 155 | 39 |
| గోకవరం | 109 | 24 |
| సీతానగరం | 150 | 32 |
| రాజమహేంద్రవరం రూరల్ | 264 | 53 |
| ఉండ్రాజవరం | 378 | 75 |
| కొవ్వూరు | 550 | 86 |
| కొవ్వూరు అర్బన్ | 355 | 46 |
| అనపర్తి | 559 | 65 |
| చాగల్లు | 612 | 70 |
| కోరుకొండ | 306 | 33 |
| రాజమహేంద్రవరం అర్బన్ | 940 | 79 |



సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో నిర్మించిన జగనన్న కాలనీ ఇళ్లు

### ప్రతి వారం లబ్ధిదారులతో ముఖాముఖి


ఉగాది నాటికి గృహప్రవేశాలకు ముమ్మర కసరత్తు చేస్తున్నాం. ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన సాగుతున్నాయి. మిగిలినవి కూడా వేగవంతం చేసేందుకు ప్రతి శనివారం క్షేత్ర స్థాయి పర్యటనలో లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడుతున్నాం. ఏవైనా సమస్యలుంటే చెప్పాలని కోరుతున్నాం. ఇల్లు కట్టుకుంటే బిల్లు సకాలంలో వస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చైతన్యం తీసుకువస్తున్నాం. ఉగాది నాటికి అనుకున్న లక్ష్యాన్ని అధిగమించి గృహప్రవేశాలు చేపడుతాం. జిల్లాలో ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 13,019 ఇళ్లకు విద్యుత్, తాగు నీరు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

- కె.మాధవీలత, కలెక్టర్

### లక్ష్యాన్ని అధిగమిస్తాం


ఉగాది నాటికి ప్రభుత్వం నిర్దేశించిన గృహ నిర్మాణాల లక్ష్యాన్ని అధిగమిస్తాం. జిల్లా వ్యాప్తంగా 6,318 గృహప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించగా.. ఇప్పటికే 1,211 పూర్తి చేశాం. మిగిలినవి త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి వారం ప్రత్యేక హౌసింగ్ కార్యక్రమం నిర్వహిస్తూ లబ్ధిదారులను చైతన్యపరుస్తున్నాం.

- జి.పరశురాం, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ

### ప్రశాంతంగా స్కాలర్‌షిప్ పరీక్ష


రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ అబ్రహం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జిల్లాలోని 11 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించామన్నారు. మొత్తం 2,611 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2,439 మంది పరీక్ష రాశారన్నారు. రాజమహేంద్రవరంతో పాటు పలు ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలను డీఈఓ తనిఖీ చేశారు. కలెక్టర్ పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్, వైద్య సిబ్బందిని ముందు జాగ్రత్తగా నియమించారు.

### రత్నగిరికి పోటెత్తిన భక్తులు
- సత్యదేవుని దర్శించిన 70 వేల మంది
- రూ.70 లక్షల ఆదాయం



స్వామివారి వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రత్నగిరి భక్తులతో కిక్కిరిసిపోయింది. సుమారు 70 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించినట్టు అధికారులు తెలిపారు. శనివారం రాత్రి నుంచే వేలాదిగా భక్తులు రత్నగిరికి తరలివచ్చారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజామున 3 గంటల నుంచే వ్రతాల నిర్వహణ ప్రారంభించి, భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం వరకూ భక్తులతో స్వామివారి ఆలయం కిటకిటలాడింది. సత్యదేవుని ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, సాధారణ దర్శనానికి గంట పట్టింది. భక్తులతో వ్రత మండపాలు నిండిపోవడంతో స్వామివారి నిత్యకల్యాణ మండపంలో కూడా ఉదయం పది గంటల వరకూ వ్రతాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామివారి నిత్య కల్యాణం ప్రారంభించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.70 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. వ్రతాలు 6,950 జరిగాయి. భక్తులకు నిత్యాన్నప్రసాద పథకంలో పులిహోర, దద్ధోజనం పంపిణీ చేశారు. ఏర్పాట్లను దేవస్థానం ఈఓ సత్యనారాయణమూర్తి పర్యవేక్షించారు.

# కలెక్టర్ 11 X ఎస్పీ 11

- జీఎస్ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగులు

రాజానగరం: విధి నిర్వహణలో నిరంతరం వివిధ ఒత్తిళ్లకు గురయ్యే ఉద్యోగులు ఈ ఆదివారం ఆటవిడుపుగా గడిపారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానం ఇందుకు వేదిక అయ్యింది. ఇక్కడ కలెక్టర్ 11, ఎస్పీ 11 జట్ల మధ్య పొట్టి ఫార్మాట్(టి–20)లో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఇందులో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత టాస్ గెలిచిన కలెక్టర్ కె.మాధవీలత జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి జట్టు నిర్ణీత 20 ఓవర్లకుగాను 19.1 ఓవర్లలోనే 97 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కలెక్టర్ టీమ్ ప్రత్యర్థి ఇచ్చిన టార్గెట్‌ను 11.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 101 పరుగులతో అధిగమించింది. 4 పరుగులు, 8 వికెట్ల తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ టీమ్‌లో అరవింద్ 26 బంతులకు 34 పరుగులు, కెప్టెన్‌గా వ్యవహరించిన రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ 28 బంతులకు 31 పరుగులు చేసి, జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు. కలెక్టర్ టీమ్‌కు విన్నర్ ట్రోఫీని, ఎస్పీ టీమ్‌కు రన్నర్ ట్రోఫీని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అరవింద్, బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా కె.దినేష్‌కుమార్, బెస్ట్ ఫీల్డర్‌గా కార్తికేయ ఎంపికయ్యారు. అంపైరర్లుగా హరి టీమ్ (స్టేట్ ప్యానల్ అంపైర్) వ్యవహరించింది.

**ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదం**

అంతకుముందు కలెక్టర్ కె.మాధవీలత ఉద్యోగులనుద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రతి ఉద్యోగి నిరంతరం ఒత్తిడికి గురవుతారని, దీనిని క్రీడల ద్వారా అధిగమించవచ్చని అన్నారు. క్రీడలతో మేధోసంపత్తి వృద్ధి చెందుతుందని చెప్పారు. జిల్లాల విభజన జరిగి ఏడాది కావస్తోందని, ఉద్యోగులందరూ ఒక టీమ్ వర్కుతో జిల్లా ప్రగతికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రగతిలో ఎప్పుడూ ముందుండే జిల్లాకు ఆ ఖ్యాతిని నిలబెట్టడంలో ఒక్కోసారి ఒత్తిడికి గురవుతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో స్నేహపూర్వక వాతావరణంలో క్రీడా పోటీల్లో పాల్గొనడం మానసికోల్లాసానికి దోహదపడుతుందని అన్నారు. ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగులు ఒత్తిడిని అధిగమించి, ఉల్లాస వాతావరణంలో విధులు నిర్వహించేలా స్నేహపూర్వక వాతావరణంలో ఇటువంటి క్రీడలు నిర్వహించడం హర్షణీయమని అన్నారు. ఇరు జట్లలోని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీఓలు ఎ.చైతన్య వర్షిణి, ఎస్.మల్లిబాబు, జిల్లా క్రీడా శిక్షకుడు ఎంఎం శేషగిరి టీమ్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



విజేత కలెక్టర్‌కు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ



బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి



బౌలింగ్ చేస్తున్న కలెక్టర్ మాధవీలత

# కేంద్రమా.. దారి చూపుమా

- కీలక గ్రామీణ రోడ్ల నిర్మాణంపై ఏడాదిగా ఎదురుచూపులు
- ఉమ్మడి తూర్పున 58.62 కిలోమీటర్ల మేర ప్రతిపాదనలు
- రూ.34.41 కోట్లతో అంచనాలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు గ్రామీణ రహదారుల ఆధునీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు ఏడాదిగా కేంద్ర ప్రభుత్వం వద్ద మూలుగుతున్నాయి. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి; కాకినాడ జిల్లా పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట; డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని పలు ముఖ్య రహదారులు పదిహేనేళ్లుగా అభివృద్ధికి నోచడం లేదు. వీటి అభివృద్ధిని గత పాలకులు కనీసంగా కూడా పట్టించుకోలేదు. ఇలా అధ్వానంగా ఉన్న వాటిలో ప్రజలకు అత్యంత ప్రధానమైనవిగా పంచాయతీరాజ్ శాఖ 58.62 కిలో మీటర్ల పొడవైన రోడ్లను గుర్తించింది. వీటి పునర్నిర్మాణానికి ఏడాది క్రితం ప్రధానమంత్రి గ్రామీణ్ సడక్ యోజన (పీఎంజీఎస్వై) కింద కేంద్ర ప్రభుత్వానికి రూ.34.41 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వీటిని ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడంతో.. ఈ ప్రతిపాదనలకు ఎప్పుడు మోక్షం లభిస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

**ప్రతిపాదిత రహదారులివిగో..**

- కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జి.మేడపాడు – పెద్దాడ రోడ్డుకు గడచిన ఒకటిన్నర దశాబ్దాలుగా కనీస మరమ్మతులు కూడా లేవు. సుమారు 10 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులకు ఇదే ప్రధాన రహదారి. కాకినాడ జిల్లా పెదపూడి, గొల్లల మామిడాడ; కోనసీమ జిల్లా రామచంద్రపురం, ద్రాక్షారామలకు ఇది దగ్గర దారి కావడంతో నిత్యం ఐదారు వందల వాహనాలు ప్రయాణిస్తూంటాయి. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది.
- కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం శృంగవరం – బవురువాక రోడ్డు కూడా ఒకటిన్నర దశాబ్దాలుగా అధ్వానంగా ఉంది. అయినప్పటికీ గత ప్రభుత్వాలు కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో శృంగవరం, గౌరంపేట, మాసంపల్లి, జగన్నాథపురం, బవురువాక తదితర 15 గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.
- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం శరభవరం, దోపర్తి, బవురువాక రోడ్డును నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అభివృద్ధి చేశారు. ఆ తరువాత ఈ రోడ్డు గురించి పట్టించుకున్న వారే లేరు. దీంతో పాండవులపాలెం సెంటర్ నుంచి గజ్జనపూడి బ్రిడ్జి, పోతురాజుబాబు గుడి దగ్గర నుంచి తాడువాయి వరకూ రోడ్డు దారుణంగా దెబ్బ తింది. తాడువాయి, బవురువాక, పాండవులపాలెం, దోపర్తి తదితర సుమారు 10 గిరిజన గ్రామాల్లోని ఐదారువేల మందికి ఇది ఎంతో ముఖ్యమైన రహదారి.
- కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రాజుపూడి – ఉప్పలపాడు రోడ్డు కూడా అధ్వానంగా ఉంది. జగ్గంపేట మండలం సీతారాంపురం, రాజుపూడి, వెంగయమ్మపురం, గోవిందపురం, క్రిష్టాపురం గ్రామాలను 16వ నంబర్ జాతీయ రహదారితో ఈ రోడ్డు అనుసంధానం చేస్తుంది. ఉప్పలపాడు, సీతారాంపురం, రాజుపూడి, మల్లేపల్లి తదితర 12 గ్రామాల రైతులు, ప్రజలు సుమారు 35 వేల మంది నిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తూంటారు.
- కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గుర్రంపాలెం – బలభద్రపురం రహదారిది కూడా దాదాపు ఇదే పరిస్థితి. గుర్రంపాలెం, గొల్లలగుంట, కాండ్రేగుల, నరేంద్రపట్నం, భావారం గ్రామాల ప్రజలు గోకవరం వెళ్లేందుకు ఇది దగ్గర మార్గం. ఈ గ్రామాల ప్రజలు జగ్గంపేట రావాల్సిన అవసరం లేకుండా గుర్రంపాలెం నుంచి బలభద్రపురం మీదుగా కొత్తూరు మెయిన్ రోడ్డుకు చేరవచ్చు. గత ప్రభుత్వం ఈ రోడ్డును ఏమాత్రం పట్టించుకోలేదు.
- రాజుపూడి – భూపతిపాలెం మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు. ఇది పూర్తయితే గోకవరం మండలం భూపతిపాలెం, మల్లవరం, గంగవరం మండలం మొల్లేరు, పిడతమామిడి, నెల్లిపూడి, వేములోవ, గంగవరం వెళ్లే వారికి దీర్ఘకాలంగా ఉన్న సమస్య తీరనుంది. భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులకు కూడా ఈ వంతెన ఎంతో ఉపయోగకరం.
- కోనసీమ జిల్లా అల్లవరం మండలం గురుకుల పాఠశాల నుంచి కర్రిచెరువు వరకూ నాలుగు గ్రామాలను కలిపే లింకు రోడ్డు ఉంది. మొగళ్ళమూరు ప్రధాన రహదారి నుంచి గురుకుల పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇది ఎంతో అనువైనది. పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. మొగళ్లమూరు ప్రధాన రహదారిని అనుసంధానిస్తూ బీరవారిపేట మీదుగా గుండెపూడి వరకూ గత ప్రభుత్వ హయాంలో రోడ్డు పనులు ప్రారంభించి, అసంపూర్తిగా వదిలేశారు.
- అల్లవరం మండలం బోడసకుర్రు – బెండమూర్లంక రహదారి దశాబ్ద కాలంగా కాగితాలకే పరిమితమైంది. పేరూరు వై–జంక్షన్ నుంచి కాకుండా బోడసకుర్రు వద్ద 216 జాతీయ రహదారి నుంచి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్‌కు చేరడానికిది అనువైన మార్గం. దీనిని అభివృద్ధి చేస్తే ఓఎన్‌జీసీ భారీ వాహనాల తరలింపు సమయంలో ట్రాఫిక్, విద్యుత్ అంతరాయం సమస్యల నుంచి ప్రజలకు ఊరట లభిస్తుంది. వైనతేయ ఏటిగట్టుపై సుమారు 13 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మిస్తే ఓడలరేవు, బెండమూర్లంక గ్రామాల నుంచి జాతీయ రహదారికి దూరం తగ్గుతుంది. బోడసకుర్రు, గోడితిప్ప, గోడి, బెండమూర్లంక గ్రామాలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చాలా ముఖ్యమైన రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించి దాదాపు ఏడాది కావస్తోందని, కేంద్రం నుంచి త్వరలో మంజూరు వస్తుందని ఎదురు చూస్తున్నామని పంచాయతీరాజ్ ఎస్ఈ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.



అధ్వానంగా ఉన్న జి.మేడపాడు – పెద్దాడ రహదారి

## క్లుప్తంగా

### ఉత్సాహంగా కరాటే పోటీలు


కరాటే పోటీలను ప్రారంభిస్తున్న వైడీ రామారావు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ): స్థానిక శుభం కాపు ఫంక్షన్ హాల్‌లో రియాస్ ఆర్‌యూ షోటోకాన్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ కరాటే పోటీలు ఆదివారం జరిగాయి. రాష్ట్ర టెన్నికాయిట్ సంఘ అధ్యక్షుడు వైడీ రామారావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటేతో ఆత్మరక్షణతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. క్రీడా స్ఫూర్తితో పోటీలో రాణించాలని కోరారు. పోటీల నిర్వాహకుడు, కరాటే మాస్టర్ సూర్యను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బి.వెంకటేశ్వరరావు, కేత శ్రీను, ట్రాఫిక్ ఎస్ఐ విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిపై ఎద్దు దాడి


అపస్మారక స్థితిలో ఉన్న అడపా వెంకన్న

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు గ్రామంలో ఓ వ్యక్తిపై ఎద్దు దాడి చేసిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కట్టమూరు గ్రామానికి చెందిన అడపా వెంకన్న (50) పొలం పనులు చేస్తుండగా సమీపంలో ఉన్న ఎద్దు అకస్మాత్తుగా దాడి చేసింది. కొమ్ములతో పొడవడంతో ఎడమ చేతికి గాయం కాగా పదే పదే కొమ్ములతో పొడడంతో ఆ వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు గమనించి పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చోరీ ఘటనపై కేసు నమోదు

అయినవిల్లి: విలస గ్రామంలో ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కథనం ప్రకారం.. విలసకు చెందిన పోలిశెట్టి దుర్గారావు కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ఉదయం వ్యాపారం కోసమని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. భార్య వీరరాఘవమ్మ సమీపంలో గుడికి వెళ్లింది. ఇది గమనించిన గుర్తు తెలియని దుండగుడు ఇంటి తలుపు గడియ తొలగించి లోనికి ప్రవేశించాడు. రూ.1.60 లక్షల నగదు, 12 కాసుల బంగారు ఆభరణాలు అపహరించాడు. దీనిపై దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## స్వామి జలకమాడగ.. మది పులకించగ


చక్రస్నానం చేయించేందుకు నారసింహ స్వామివారిని తోడ్కొని వెళ్తున్న అర్చకులు


అంతర్వేదిలో సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు

- నారసింహునికి వైభవంగా చక్రస్నానం
- భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి పూజలు
- గరుడ పుష్పక వాహనంపై స్వామికి గ్రామోత్సవం

సఖినేటిపల్లి: సుదర్శన చక్రధారి నరసింహస్వామిని భక్తులు మనసారా సేవించారు.. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం అంతర్వేది వద్ద సముద్ర తీరం భక్తిభావంతో ఉప్పొంగింది. నారసింహుని వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు స్వామివారి చక్రస్నానం అత్యంత వైభవంగా జరిగింది. సుదర్శన చక్రం ధరించిన నృసింహస్వామి (సుదర్శన పెరుమాళ్ స్వామి) జలకమాడిన కడలిలోనే అసంఖ్యాకమైన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పులకించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వెంకటశాస్త్రి ఆధ్వర్యంలో పేరూరు ఉద్దండ పండితులు స్వామిని శిరస్సుపై ఉంచుకుని సముద్ర స్నానం చేయించారు. తొలుత ఆలయం వద్ద నుంచి 8 గంటలకు ఉత్సవ మూర్తులను గరుడ పుష్పక వాహనంపై, పల్లకిలో నృసింహస్వామిని ఊరేగిస్తూ మంగళ వాయిద్యాలతో సముద్ర తీరానికి తోడ్కొని వచ్చారు. తీరంలో దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో స్వామి, అమ్మవార్లను ఆశీనులు చేశారు. స్వామివారికి పంచామృతాలు, కొబ్బరి నీళ్లతో ప్రధానార్చకుడు కిరణ్, స్థానాచార్య రామరంగాచార్యులు, వేదపండితుడు వెంకటశాస్త్రి, అర్చకులు అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని అర్చకులు ఊరేగింపుగా వసంత మండపానికి తీసుకు వెళ్లారు. దద్దోజనం, పానకాలను స్వామివారికి ఆలయ అర్చకులు నైవేద్యంగా సమర్పించారు. అమలాపురం ఆర్డీవో వసంతరాయుడు, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహద్దూర్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

**కిక్కిరిసిన ఆలయం**

ఆలయం వెలుపల, ధర్మదర్శనం, శ్రీఘ్రదర్శనం క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజాము నుంచి సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య అంతకంతకూ పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలయ్యే సరికి క్యూలైన్లు నిండిపోయాయి. సాయంత్రం వరకూ కూడా క్యూలో భక్తులు వెళ్లి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు.

**అంతర్వేదిలో నేడు**

అంతర్వేది తీర్థమహోత్సవాల్లో సోమవారం పదో రోజు స్థానిక చెరువులో సాయంత్రం 6 గంటలకు హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం జరుగుతుంది. విద్యుద్దీపాల మధ్య, బాణసంచా కాల్పులతో ఈ ఉత్సవం నిర్వహించనున్నారు. ముందు 5 గంటలకు పుష్పక వాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు ఉత్సవరులకు తిరుమంజనాలు, దర్పణ సేవ, ధూపసేవ, ద్వాదశ తిరువారాధన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోల విన్నపం, తీర్థగోష్ఠి, స్వామివారి పవళింపు సేవ అర్చకులు చేస్తారు.


భీమేశ్వరాలయ సప్త గోదావరిలో త్రిశూల స్నానం, చక్రస్నానం ఆచరిస్తున్న భక్తులు

## వైభవం.. భీమేశ్వరుని వసంతోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా పేరొందిన ద్రాక్షారామ క్షేత్రంలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం వసంతోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి (తారకేశ్వరరావు) ఆధ్వర్యంలో ముందుగా వేగాయమ్మపేటలోని ఆస్థాన మండపం నుంచి కల్యాణ మూర్తులైన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్లను రథంపై దేవాలయానికి తీసుకు వచ్చారు. ఆలయంలో వేదపండితులు, ఆలయ అర్చకుల వేద మంత్రోచ్ఛారణలు, మేళ తాళాల మధ్య తీర్థపు బిందె, బాలభోగం, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, నాకబలి, గ్రామోత్సవాలు జరిగాయి. త్రిశూల స్నానం, చక్రస్నానం కార్యక్రమాలను వైభవంగా జరిపారు.

**నేడు తెప్పోత్సవం**

భీమేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం మేలుకొలుపు, సుప్రభాత సేవ, తీర్థపు బిందె, బాలభోగం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు భక్తులచే విశేష అభిషేకాలు, మాణిక్యాంబా అమ్మవారికి వివిధ రకాల పుష్పార్చన, కుంకుమార్చనలు చేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న కాలార్చన, రాజభోగ నివేదన సేవ అనంతరం రాత్రి 7.15 గంటలకు సప్త గోదావరి నదిలో శ్రీస్వామివార్లు, అమ్మవార్ల తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహిస్తారు.

## కపిల ఆవు, గిత్తలకు వైభవంగా వివాహం

రాజమహేంద్రవరం రూరల్: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలు గ్రామంలో నిమ్మలపూడి రవీంద్ర, గంగాభవాని దంపతులు ఆదివారం కపిల ఆవు, గిత్తలకు శాస్త్రోక్తంగా వివాహ మహోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, బంధుమిత్రుల సమక్షంలో లక్ష్మీ నారాయణ పూజ, హోమం అనంతరం పెళ్లి వేడుక జరిపించారు. ముందుగా గిత్త, ఆవులకు బాసికాలు కట్టి, తలంబ్రాలు, దండలు వేయడం వంటి తతంగాలు పూర్తి చేశారు. చివరిగా కపిల గిత్తకు శంఖుచక్రం అచ్చు వేసి గ్రామంలోకి వదిలేశారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన బంధుమిత్రులకు పసందైన విందు భోజనాలు సైతం ఏర్పాటు చేశారు. ఇంట్లో కపిల ఆవు ఉంటే లక్ష్మీదేవి ఉన్నట్టేనని రవీంద్ర అన్నారు. కపిల ఆవులను పెంచడంతో తనకు ఆర్థికంగా, ఉద్యోగ పరంగా పదోన్నతులు, అన్ని విధాలా అభివృద్ధి జరిగిందన్నారు. 15 ఏళ్ల కిందట ప్రముఖ పాడి రైతు కొప్పాక వెంకట నారాయణ కపిల గిత్త, కపిల ఆవులకు పెళ్లి చేయడం చూశానని, అప్పుడే తనకు కూడా అలా చేయాలన్న భావన కలిగిందని చెప్పారు. తన వద్ద ఉన్న కపిల గిత్తకు, కపిల ఆవును కొనుగోలు చేసి, రెండింటికీ వివాహం జరిపించడంతో 15 ఏళ్ల నాటి తన ఆకాంక్ష నెరవేరిందని అన్నారు.


కపిల గిత్త, ఆవులకు వివాహం జరిపిస్తున్న రవీంద్ర, గంగాభవాని దంపతులు

## సలామ్ పోలీస్..

- వృద్ధురాలికి అంత్యక్రియలు చేసిన ఎస్సై
- ఆమె పేరుతో పేదలకు అన్నదానం

ఉండ్రాజవరం: తల్లి కళ్లముందే మరణించినా ఏమీ చేయలేని అచేతన స్థితి ఆ కుమారుడిది.. అనారోగ్యం మంచాన పడేయంతో కుంగిపోతున్న అతనికి కొండంత అండగా నిలిచారా పోలీసులు. ఆ వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటడమే కాకుండా అన్నదానం చేసి అందరికీ ఆదర్శమయ్యారు ఉండ్రాజవరం పోలీసులు. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఉండ్రాజవరం సంత మార్కెట్ రోడ్డులో నివాసముంటున్న తాతబత్తుల గాయత్రి (80) అనారోగ్యంతో గత నెల 25న మృతి చెందింది. ఆమె కుమారుడు అనారోగ్యంతో మంచాన ఉండటంతో దహన సంస్కారాలు చేయలేని నిస్సహాయ పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని వార్డు సభ్యురాలు కల్పన, ఆమె భర్త కృష్ణ, మాచినేని మధు, పిప్పర్ల వరప్రసాద్‌లు స్థానిక ఎస్సై కె.రామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్సై వెంటనే స్పందించి ఆమె అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అమ్మా బ్లడ్ అంబులెన్స్ రాము, స్థానికులు, పోలీసు సిబ్బందితో కలసి మృతురాలికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉంటే ఆదివారం ఉండ్రాజవరం పోలీసులంతా కలసి ఆమె పేరుతో 100 మంది పేదలకు అన్నదానం చేసి దాతృత్వాన్ని చాటారు. ఈ సందర్భంగా ఎస్సై కె.రామారావు మాట్లాడుతూ స్థానికులు, సిబ్బంది సహకారంతో ఆ వృద్ధ మహిళకు అంత్యక్రియలు నిర్వహించామన్నారు. ఉండ్రాజవరం పోలీసులు పేదలకు అన్నదానం చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. జీవితంలో ప్రతి మనిషి ఏదో ఒక సందర్భంలో వారికి తోచిన విధంగా ఎదుట వారికి సహాయం చేయాలన్నారు. ఒకరికొకరు సాయపడితే సమాజంలో విలువలు పెరుగుతాయన్నారు.


ఉండ్రాజవరంలో మృతురాలి పేరుతో పేదలకు అన్నదానం చేస్తున్న ఎస్సై రామారావు, సిబ్బంది

## ఇంట్లోకి దూసుకుపోయిన లారీ

**త్రుటిలో తప్పిన పెను ప్రమాదం**

దేవరపల్లి: దేవరపల్లి మండలం గొల్లగూడెం వద్ద ఓ ఇంట్లోకి ఆదివారం లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో గోపాలపురం వైపు నుంచి దేవరపల్లి వెళుతున్న భారీ లారీ గొల్లగూడెంలో మలుపు వద్ద అదుపు తప్పింది. అక్కడి పాశం కృష్ణారావు ఇంట్లోకి దూసుకుపోయింది. వెంటనే బోల్తా పడింది. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఇంటి లోపల భాగంలోని పడక గది గోడ బీటలు తీసి పెచ్చులు ఊడి పడడంతో ఇద్దరు కుటుంబ సభ్యులు స్వల్పంగా గాయపడినట్టు కేశవరావు తెలిపారు. భవనం శిథిలం కాగా, వంట షెడ్డు పూర్తిగా కూలిపోయిందని ఆయన వివరించారు. రోడ్డు మలుపు ప్రమాదకరంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రెండేళ్ల కిందట రోడ్డు విస్తరించిన అధికారులు మలుపు సరిచేయకపోవడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గొల్లగూడెంలో ఇంట్లోకి దూసుకుపోయి బోల్తా పడిన లారీ


ప్రమాదంతో బీటలు తీసిన గది గోడలు

## ఈనాటి బంధం ఆనాటిదే..


అంబాజీపేటలో కలుసుకున్న 1968 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: స్నేహం ముందు వృద్ధాప్యం చిన్నబోయింది. 75 ఏళ్ల వయస్సులోనూ వారంతా చిన్నపిల్లల్లా మారిపోయి ఆనాటి మధుర జ్ఞాపకాలు నెమర వేసుకున్నారు. ఎప్పుడో 55 ఏళ్ల కిందట పదో తరగతి కలసి చదువుకొన్న వారు ఒకటిగా కలుసుకోవడం అపురూపమని, జీవితంలో కలకాలం నిలిచేది స్నేహమేనని గుర్తు చేశారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో 1968–69లో ప్రారంభించిన మొట్టమొదటిగా విద్యనభ్యసించిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే స్కూల్‌లో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొంటూ ఆప్యాయతలు పంచుకొన్నారు. దూర ప్రాంతాల్లోను, వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ సమావేశానికి హాజరై స్నేహానికి ఉన్న విలువను చాటారు. తమకు విద్య నేర్పిన గురువులు ఆకెళ్ల లక్ష్మీనారాయణ, బొరుసు సత్యనారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు గురువులకు పాదపూజ చేశారు.



## మృతుడి కుటుంబానికి భరోసా

**రూ.6 లక్షల సాయం అందజేత**


రాజమహేంద్రవరంలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత జక్కంపూడి గణేష్

మధురపూడి: కోరుకొండ మండలం కోటికేశవరంలో మట్టిపెళ్లలు పడి మృతి చెందిన బూలా రాంబాబు కుటుంబానికి అండగా ఉంటామని, అతని పిల్లల చదువుకు ప్రోత్సాహం అందిస్తామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత జక్కంపూడి గణేష్ భరోసా ఇచ్చారు. కోటికేశవరంలో సాగునీటి కాలువ పనులు చేస్తుండగా మట్టి పెళ్లలు పడి రాంబాబు శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. అతనిని హాస్పటల్‌లో చేర్పినప్పటి నుంచి జక్కంపూడి కుటుంబం సహకారం అందిస్తూనే ఉంది. చివరికి అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబానికి పరిహారాన్ని అందించాలని సంబంధిత నిర్మాణ పనికి చెందిన కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేసింది. దీంతో ఆ కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కును రాజమహేంద్రవరంలోని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కార్యాలయంలో ఆదివారం అందజేశారు. అలాగే బాధిత తల్లికి జక్కంపూడి కుటుంబం నుంచి రూ.లక్ష ఇచ్చారు. మృతుడి ఇద్దరు పిల్లల చదువుకు సహకారాన్ని అందజేస్తామని గణేష్ హామీ ఇచ్చారు. కాలువ పనిలో ప్రమాదవశాత్తు రాంబాబు మృతి చెందడం దురదృష్టకరమన్నారు. జగనన్న ప్రభుత్వం పేదల పక్షాన నిలిచి న్యాయం చేస్తుందన్నారు. కష్టాల్లో ఉన్నవారికి జక్కంపూడి కుటుంబం ఆపన్న హస్తం అందిస్తుందన్నారు. ఈ ప్రమాదాన్ని కొందరు రాజకీయాలకు ఉపయోగించుకోవాలని చూడడం సరికాదన్నారు. ఈ తరహా సంస్కృతిని విడనాడాలని హితవు పలికారు. దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ పేరిట ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ఆయన గుర్తు చేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన రాంబాబు కుటుంబంతో పాటు, అతనిపైనే ఆధారపడిన తల్లికి కూడా న్యాయం చేయాలనే ఉద్దేశంతో రూ.లక్ష చెక్కును అందించినట్టు ఆయన తెలిపారు.

## రేషన్ బియ్యం స్వాధీనం


పండూరులో రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కాకినాడ రూరల్: పండూరు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. కాకినాడ రూరల్ ఎంఎస్ఓ మమత మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు పండూరులో ఒక ఇంటి వద్ద నిల్వ ఉంచిన మూడు టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ మేరకు బి.ప్రత్తిపాడుకు చెందిన బొజ్జా వరప్రసాద్‌పై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. సదరు బియ్యం 65 ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉంచడంతో వాటిని కాకినాడ ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించారు. దీనిపై తిమ్మాపురం పోలీసు స్టేషన్‌లో ఎంఎస్ఓ ఫిర్యాదు చేశారు.

### నమో.. ప్రత్యక్ష నారాయణా..



మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం కాకినాడ రూరల్ సూర్యారావుపేట సాగర తీరంలో భానుడు లేలేత కిరణాలతో సింధూర వర్ణంలో ప్రతిబింబించి మానసికోల్లాసాన్ని కలిగించాడు. కనువిందైన దృశ్యాలను వీక్షిస్తూనే స్వర్ణ శోభితమైన దివిలోని భానుని దర్శిస్తూ వేకువ జామున సముద్ర స్నానాలకు వచ్చిన భక్తులు అక్కడే సూర్య నమస్కారాలు, పూజలు చేసుకున్నారు.

- కాకినాడ రూరల్

## వి స్టార్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎంఆర్‌కేహెచ్ సిండ్రోమ్‌తో బాధ పడుతున్న 22 ఏళ్ల మహిళకు అరుదైన శస్త్రచికిత్స చేసినట్టు స్థానిక దానవాయిపేట వి స్టార్ ఆసుపత్రి వైద్యులు సింగంశెట్టి లక్ష్మి తెలిపారు. మర్మావయవం, గర్భాశయం అభివృద్ధి చెందకుండా ఉన్న ఆ మహిళకు డేవిడోస్ టెక్నిక్‌తో లాప్రోస్కోపిక్ వాజినోప్లాస్టీ శస్త్రచికిత్స చేశామన్నారు. ఏడు రోజుల అనంతరం డిశ్చార్జి చేశామని, దీంతో ఆమె సాధారణ జీవితం గడపవచ్చని తెలిపారు.


డాక్టర్ సింగంశెట్టి లక్ష్మి